క్లుప్తంగా

8న సామూహిక వరలక్ష్మీవ్రతం



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో 8వ తేదీన ఆదిలక్ష్మీదేవికి సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు ఆదివారం తెలిపారు. వ్రతంలో పాల్గొనే భక్తులకు అమ్మవారి ప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ, గాజులను ఉభయకర్త సీతారామయ్య స్వామి అందిస్తారని వెల్లడించారు.

కండలేరులో 25.832 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 25.832 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.


వాలీబాల్ కిట్ వితరణ



మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు యువతకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆవుల తులసీరాం సొంత నిధులతో వాలీబాల్ కిట్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. జట్ల కొండూరులో యువత క్రికెట్, వాలీబాల్లో ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. అందుకే వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట స్కూల్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు ఉన్నారు.

లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు



చిల్లకూరు: కర్ణాటక నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీ రైటర్‌సత్రం సమీపంలో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. లోడు లారీ శనివారం రాత్రి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి నెల్లూరుకు బయలుదేరింది. ఆదివారం వేకువజామున మండలంలోని రైటర్‌సత్రం వద్దకు లారీ వచ్చేసరికి డ్రైవర్ కునుకు తీయడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గాయపడ్డాడు. కాగా లారీ రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విచారణ చేస్తున్నారు.

టీచర్స్ క్రికెట్ లీగ్‌ను జయప్రదం చేయండి

గూడూరు రూరల్: గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 31వ తేదీ నుంచి జరిగే 6వ టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో ఆదివారం టోర్నమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 3వ వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆరేళ్లుగా ప్రతిష్టాత్మకంగా లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నీకి సంబంధించిన విధివిధానాలపై చర్చించారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీడీ కరిముల్లాఖాన్, మురళీసింగ్, షేక్ బాబర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సీనియర్ క్రీడాకారులు మునిభాస్కర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పొదలకూరు: పట్టణంలోని గాయత్రి స్కూల్లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. నెల్లూరు ఎస్‌బీటీ స్పెషాలిటీ ఆర్థోపెడిక్ సెంటర్ వైద్యులు శిబిరంలో పాల్గొని వంద మందికి మోకాళ్లు, వెన్నునొప్పులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చైతన్యకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రబాబు పాల్గొన్నారు.

ఆక్రమిస్తాంమండీ.. మా ఇష్టం

- ఖాళీ చేయించిన స్థలాల్లోనే మరోసారి
- ఆచరణకు నోచుకోని మంత్రి నారాయణ ఆదేశాలు
- రూ.లక్షల విలువజేసే స్థలాల్లో జోరుగా తంతు
- శాశ్వతంగా దుకాణాల నిర్మాణం
- కబ్జాకు గురై కుచించుకుపోతున్న కృష్ణపట్నం కాలువ
- పట్టించుకోని అధికారులు



హరనాథపురం రహదారి పక్కన నిర్మించిన షాపులు

నెల్లూరు(బారకాసు): నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. దీంతో కొద్దిపాటి స్థలం కొనాలన్నా అంకణం రేటు రూ.లక్షల్లో పలుకుతోంది. దీంతో ఎక్కడైనా కాస్తంత స్థలం ఖాళీగా కనిపిస్తే చాలు వెంటనే దాన్ని కొందరు ఆక్రమించేస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఖాళీ స్థలాలను ఆక్రమించి ఇతరులకు విక్రయించి భారీగా ఆర్జిస్తున్నారు. నగరంలోని ముత్తుకూరు గేట్ జంక్షన్ నుంచి నారాయణ వైద్య కళాశాలకు వెళ్లే ముత్తుకూరు రోడ్డు ప్రధాన మార్గం వెంబడి ఈ తంతు జరుగుతోంది.

రూపుకోల్పోతున్న కృష్ణపట్నం కాలువ

ముత్తుకూరు గేట్ జంక్షన్ సమీపంలో సర్వేపల్లి ప్రధాన కాలువ నుంచి ముత్తుకూరు వైపు వెళ్తున్న కృష్ణపట్నం కాలువ వెంబడి ఉన్న ఖాళీ స్థలం కబ్జాకు గురైంది. ఇప్పటికే అనేక దుకాణాలను శాశ్వతంగా ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. కొత్తగా కొందరు మరికొన్ని దుకాణాల నిర్మాణాల్లో బిజీగా ఉన్నారు. వాస్తవానికి ఈ కాలువ గట్టును దాదాపు 20 ఏళ్ల క్రితమే కొందరు ఆక్రమించి ఇళ్లు, దుకాణాలను నిర్మించుకున్నారు.

యథావిధిగా మరోసారి..

నగరంలో నుంచి ముత్తుకూరు, కృష్ణపట్నం పోర్టుకు రాకపోకలు అధికమయ్యాయి. దీంతో ఈ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. అనంతరం ఆక్రమణలను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. 2011, ఫిబ్రవరి 11న ప్రార్థన మందిరాల మినహా మిగిలిన వాటిని తొలగించారు. ఆపై కొన్నేళ్ల పాటు మౌనం వహించిన ఆక్రమణదారులు తిరిగి ప్రారంభించారు. ఎలాంటి నిర్మాణాలను జరపకూడదంటూ జలవనరుల శాఖాధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను తొలగించారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ముత్తుకూరు గేట్ జంక్షన్ నుంచి నారాయణ వైద్య కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి కృష్ణపట్నం కాలువకు చెందిన స్థలంలో ఆక్రమణలు వాస్తవమే. ఇప్పటికే ఖాళీ చేయమని అక్కడున్న వారికి అనేకసార్లు నోటీసులు జారీ చేశాం. ఆక్రమణల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటాం. విద్యుత్ శాఖాధికారులు మీటర్లు ఇవ్వకూడదు. అయినా అక్కడి దుకాణాలకు మీటర్లతో పాటు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఈ విషయంపై ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు కూడా లేఖ రాశాం.

– బాలసుబ్రహ్మణ్యం, ఏఈఈ, జలవనరుల శాఖ నెల్లూరు సెంట్రల్ డివిజన్

ఓ పెద్ద.. అభయం

ప్రస్తుతం ఇక్కడ దుకాణాలు రోజురోజుకూ వెలుస్తున్నాయి. దీని వెనుక ఓ పెద్ద హస్తం ఉందని సమాచారం. ఓవైపు నగరంలో ఎక్కడా ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని.. ఒకవేళ అలా జరిగితే చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ పలుమార్లు ఆదేశిస్తూనే ఉన్నారు. ఆయన మాటలను లెక్కచేయకుండా ఆక్రమణదారులు తమ పని కానిచ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, సంబంధిత అధికారులు తమకేమీ పట్టదనే రీతిలో వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దుకాణాలు నిర్మించారిలా..





ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ కేఎస్ రాజు

నెల్లూరు(అర్బన్): స్థానిక పొగతోటలోని శ్రీచైతన్య క్లినిక్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ కేఎస్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పలువురు రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఎస్ రాజు మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో బొల్లి, సొరియాసిస్, ముఖము మీద నల్లటి, తెల్లటి మచ్చలు, మొటిమలు, మంగు, ఆనెలు, గోళ్ల సమస్యలకు వైద్య చికిత్స అందించామన్నారు. అలాగే ముఖంపై మచ్చలు పడకుండా పులిపిరులు తొలగించామన్నారు. వెంట్రుకలు రాలిపోవుట, బట్టతల, చుండ్రు, పేనుకొరుకుట వంటి వ్యాధులకు కూడా తగిన మందులు అందించామన్నారు. ఉచిత వైద్యశిబిరానికి అపాయింట్‌మెంట్ కోసం 0861–2328100 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అశోక్‌రెడ్డి, డయాబెటాలజిస్ట్ మల్లికార్జున, జనరల్ సర్జన్ టి.రమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండా శివారెడ్డి, శివయ్య, సత్యం, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



అంజమ్మ(ఫైల్)

నెల్లూరు(అర్బన్): నగరంలోని రాజీవ్ నగర్ అరటితోట ప్రాంతానికి చెందిన సుంకర అంజమ్మ(83) శనివారం రాత్రి ఆమె నివాసంలో మృతి చెందారు. రెడ్‌క్రాస్ సొసైటీ కావలి శాఖ చైర్మన్ రవిప్రకాష్, జిల్లా సభ్యుడు శ్రీహరి సహకారంతో కుటుంబ సభ్యుడు వెంకటదయాకర్ మృతురాలు అంజమ్మ నేత్రాలను నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ ఆమె నేత్రాలను సేకరించి కుటుంబసభ్యులకు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలిచిన 99595 89321, 98498 50498, 94414 41515 నంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యాయవాదుల సహకారం మరువలేనిది



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

నెల్లూరు(లీగల్): గత జూన్‌లో జరిగిన నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో వేనాటి న్యాయవాదుల ప్యానెల్ గెలుపునకు న్యాయవాదుల సహకారం మరువలేనిదని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో నగరంలోని అనిల్‌గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి గెట్ టు గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ముందుంటానన్నారు. జిల్లా జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ హైకోర్టు అనుమతితో జిల్లా కోర్టు సుందరీకరణ పనులకు రూ.1.90 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, సహాయ కార్యదర్శి కేఎల్ నారాయణ, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి చంద్రశేఖర్‌నాయుడు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్‌షిప్‌ను డేను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ స్వర్ణ రమేష్ బాబు మాట్లాడుతూ తమ సభ్యుడు బెజవాడ సునీల్‌రెడ్డి దాతృత్వంతో సుమారు 500 మంది వాకర్స్‌కు ఫ్రెండిషిప్ బ్యాండ్లు, స్వీట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ పొన్నం రవిచంద్ర, ట్రెజరర్ జీకే గోపినాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్ర శెట్టి, నేతలు డీవీ సుబ్బరాజు, జయదేవ్, కేఎంకే రెడ్డి, గోపాల్‌రెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, సుబ్బరామిరెడ్డి, చంద్రమౌళి, ఖలీల్‌బేగ్, అంకిరెడ్డి, ఆరి ప్రసాద్, బుర్రా వెంకటేశ్వర్లు, ఎన్వీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ టీబీ ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేసిన శేషం వెంకటేశ్వర్లు పదవీ విరమణ ఆత్మీయ సన్మాన సభను ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందానిబాషా మాట్లాడుతూ చిరుద్యోగి అయినప్పటికీ 34 ఏళ్ల పాటు వెంకటేశ్వర్లు స్ఫూర్తిదాయకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాడని కొనియాడారు. అనంతరం పలువురు నాయకులు, సహచరులు వెంకటేశ్వర్లు దంపతులను సన్మానించారు.

బీసీ వసతిగృహంలో క్లీన్ అండ్ గ్రీన్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీవీనగర్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో మెగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి, పచ్చని మొక్కలు నాటారు. స్టోర్‌రూమ్‌లోని నిత్యావసర సరుకులను ప్లాస్టిక్ డబ్బాల్లోకి మార్పించి లేబుల్స్ వేయించారు. అనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత జిల్లా అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు పరిశుభ్రత గురించి వివరించారు. కష్టపడి చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై పోరుబాట



గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన చేస్తున్న వివిధ పార్టీల నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం పోరుబాట నిర్వహించారు. నగరంలోని కోటమిట్ట చేపల మార్కెట్ నుంచి స్థానిక సబ్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి సాగర్, సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్‌లు మాట్లాడుతూ ఏపీలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ సంస్థలను అదానీ కార్పొరేట్ కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం చూస్తోందని, అందులో భాగంగానే స్మార్ట్ మీటర్లను రంగంలోకి తీసుకొచ్చారని ఆరోపించారు. ప్రజలను మరింత దోపిడీ చేసేందుకు కార్పొరేట్ సంస్థలు ఎదురు చూస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఒక యూనిట్ వినియోగిస్తే పగలు ఒక రేటు, రాత్రి మరో రేటును నిర్ణయించారన్నారు. దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం పడనుందన్నారు. ఇప్పటికే ట్రూఅప్ చార్జీలు, సర్‌చార్జీల పేరుతో రూ.వేల కోట్లు ప్రజల నెత్తిన వేశారని దుయ్యబట్టారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు యానాదయ్య, ఫయాజ్, హుమయున్, ఇస్మాయిల్, అజీజ్, షాన్‌వాజ్, అశోక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- స్మార్ట్ మీటర్లతో ప్రజలపై రూ.15,400 కోట్ల అదనపు భారం పడుతోందని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి అన్నారు. ఈ మేరకు స్మార్ట్‌మీటర్లు వద్దు–పాత మీటర్లే ముద్దు అనే నినాదంతో ఆదివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా నాగేంద్రసాయి మాట్లాడుతూ సాధారణంగా నెలకు రూ.వెయ్యి వచ్చే కరెంట్‌బిల్లు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తే రూ.5 వేలు వస్తుందని, ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. వివిధ పార్టీల నేతలు జిలానీబాషా, రామరాజు, సిరాజ్, షాన్‌వాజ్, నాగేంద్ర, వినోదిని, వనజమ్మ, సోఫియా, సాయిలత, ప్రత్యూష్, సుబ్బరాయుడు, రేవంత్, మురళి, మున్నా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

'దుష్ప్రచారం చేస్తే ఊరుకోను'

నెల్లూరు(బృందావనం): తనపై దుష్ప్రచారాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని ఏపీ ఎడిబుల్ ఆయిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి అన్నారు. స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలోని తన కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. తాను నెల్లూరులోనే ఉన్నానని, తనతో జరిపిన వ్యాపార లావాదేవీలపై ఆఫీస్‌కు వచ్చి సరి చూసుకోవచ్చన్నారు.

మద్యం మత్తులో గొడవ



గాయాన్ని చూపుతున్న షఫీ

కొడవలూరు: మద్యం మత్తులో స్నేహితుల మధ్య గొడవ జరిగింది. మాటా మాటా పెరిగి ఒకరిపై మరొకరు మద్యం బాటిల్‌తో పొడిచిన ఘటన మండలంలోని నార్తురాజుపాళెంలో ఆదివారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గండవరానికి చెందిన షేక్.షఫీ, హఫీజ్‌లు స్నేహితులు. వీరిద్దరూ ఆదివారం నార్తురాజుపాళెనికి వచ్చి మద్యం సేవించారు. మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవగా మారింది. ఈ క్రమంలో హఫీజ్ మద్యం బాటిల్ పగులగొట్టి షఫీ కడుపులో పొడిచారు. రక్తస్రావంతో ఉన్న షఫీని 108 వాహనంలో నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కొడవలూరు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తు చేస్తున్నారు.

అవయవదానంపై వాకథాన్



నెల్లూరు(అర్బన్): అవయవదానంపై అపోహలు వీడాలని ఆదివారం వీఆర్సీ గ్రౌండ్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు భారీ వాకథాన్ జరిగింది. జాతీయ అవయవదానం దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవన్‌దాన్ సంస్థ, అపోలో ఆస్పత్రి, మెడికవర్, కిమ్స్, నారాయణ, ఏసీఎస్సార్ సర్వజన ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో వాకథాన్ చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, జీవన్‌దాన్ ట్రస్ట్ చీఫ్ ట్రాన్స్‌ప్లాంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు, అపోలో ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాంసతీష్, మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ రంజిత్‌రెడ్డి, కిమ్స్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ సతీష్, నారాయణ ఆస్పత్రి ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవితో పాటు పలువురు ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ అవయవదానంతో పలువురికి ప్రాణం పోయవచ్చన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద అవయవదానానికి ముందుకు రావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, కుంకుమార్చనలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్, మందిర కమిటీ అధ్యక్షుడు గుండాపంతుల సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. లక్ష్మీకామాక్షి భక్త బృందం, బాలాజీనగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో కుంకుమార్చన, పారాయణం తదితర కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకటలక్ష్మీనరసింహం మాట్లాడుతూ ఈనెల 12న సాయంత్రం రామకృష్ణ మిషన్ వారిచే సత్సంగం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మల్లవరపు లక్ష్మీనరసింహారావు, పీవీ ప్రసాద్, వి.శ్రీహరిప్రసాద్‌రావు, జి.ప్రభాకర్‌రావు, టి.వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.